నమస్తే తెలంగాణ
కామారెడ్డి
10 | నిజామాబాద్, సోమవారం 17 మార్చి 2025 | KAMAREDDY

**రైతుల సమస్యలపై** పాలకులకు పట్టింపులేకుండా పోతున్నది. యాసంగిపై యంత్రాంగం ముందస్తు ప్రణాళికలు రూపొందించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. ప్రస్తుతం యాసంగి పంట కాలం ముగిసిపోనుండగా.. బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లో పంట కోతలు షురూ అయ్యాయి. ధాన్యం రాక మొదలైనప్పటికీ ప్రభుత్వంలో అప్రమత్తత కరువైంది. కామారెడ్డి జిల్లాలో పౌరసరఫరాల శాఖతో కలెక్టర్ సమీక్షలు నిర్వహించి, వ్యూహాలు రచించారు. కొనుగోలు కేంద్రాలు ఎప్పటిలోగా ప్రారంభించేది మాత్రం వెల్లడించలేదు. నిజామాబాద్ జిల్లాలో అయితే ప్రాథమిక సమాచారం కూడా కరువైంది. సమీక్షలు సైతం పత్తా లేకుండా పోయాయి. ఉమ్మడి జిల్లాలో రైతుల స్థితి గతులపై ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష చేస్తేనే ఏమైనా ఫలితం ఉంటుందని కర్షకులు ఆశ పడుతున్నారు. ఏడాది కాలంగా ధాన్యం కొనుగోళ్లపై సర్కారులో కనీసం శ్రద్ధ కానరావడం లేదు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు సైతం సమన్వయంతో నడుచుకుని యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం లేదు. ఈ దుస్థితిలో ఇన్‌చార్జి మంత్రి రంగంలోకి దిగి యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని రైతులు కోరుతున్నారు.
–నిజామాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- కేంద్రాల ఏర్పాటుపై సర్కారు నిర్లక్ష్యం
- ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైన వరి కోతలు
- బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లో ధాన్యం రాక షురూ
- కొనుగోళ్ల ప్రక్రియపై ఇన్‌చార్జి మంత్రి దృష్టి సారించాలని కోరుతున్న రైతులు
- కామారెడ్డిలో 424 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం
- నిజామాబాద్‌లో ఇంకా నిర్ణయించని యంత్రాంగం
- జిల్లాలో సాగునీరందక పడిపోనున్న దిగుబడులు

# ధాన్యం కొనుగోళ్లపై పట్టింపేదీ?



రాష్ట్రంలో తొలుత వరి పంట కోతకు వచ్చే ప్రాంతాల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బాన్సువాడ, బోధన్, జుక్కల్ నియోజకవర్గాలు ముందుంటాయి. యాసంగి, వానకాలంలో మొదట ఇక్కడే వరి కోతలు మొదలవుతుండడం ఆనవాయితీగా వస్తున్నది. కోతలు పూర్తి కాగానే వెంటనే దుక్కి దున్నడం, ఆ వెంటనే వరి నాట్లకు సంసిద్ధులు కావడం ఈ ప్రాంత రైతన్నల ప్రత్యేకత. కోతలు ప్రారంభమైన ఈ పరిస్థితిలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై కాంగ్రెస్ సర్కారు నుంచి ఉలుకూ పలుకూ కరువైంది. నిజామాబాద్ జిల్లాలో యాసంగిలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1.13లక్షల హెక్టార్లు కాగా అంతకు ఎక్కువే పంటను సాగు చేశారు. దాదాపుగా 12లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉన్నదని వ్యవసాయ శాఖ అంచనాలున్నాయి. ఇందులో అధిక భాగం గంగా కావేరి ఉంది. మిగిలినది దొడ్డు రకం దిగుబడులు వచ్చే అవకాశాలున్నాయి. 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు నిజామాబాద్ జిల్లా యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం గతేడాది మాదిరిగానే సుమారుగా 460 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. అయితే బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో కోతలు షురూ అయినప్పటికీ నిజామాబాద్ జిల్లాలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఊసే లేకపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తున్నది. పంట కోస్తున్న రైతులంతా అందుబాటులో ధాన్యం సేకరణ కేంద్రాలు లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తులకు విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యంపై అసహనం వ్యక్తంచేస్తున్నారు.

**కామారెడ్డి జిల్లాలో 424 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**

కామారెడ్డి జిల్లాలో ఈ నెల13న కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో 424 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. యాసంగిలో 2,61, 110 ఎకరాల్లో వరి సాగు చేయగా 57,445 ఎకరాల్లో సన్నరకం, 2లక్షల 3వేల 665 ఎకరాల్లో దొడ్డురకం సాగు చేశారు. 1,32,121 మెట్రిక్ టన్నుల సన్న రకం, 4,88,796 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం దిగుబడులు వస్తాయని అంచనాలు రూపొందించారు.

**బోనస్‌పై ఆశలు..**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తామని హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 15నెలలు గడుస్తున్నా బోనస్‌పై అతీగతీ లేదు. గత వానకాలంలో బోనస్‌ను కేవలం సన్న రకాలకే అమలు చేశారు. సన్నరకాలు పండించిన రైతులకు సైతం అరకొరగానే బోనస్ ఇచ్చారు. ఈసారి బోనస్ రూపంలో వచ్చే ప్రోత్సాహకాలను అందిపుచ్చుకునేందుకు రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం చెప్పిన సన్న రకం వడ్లనే రైతులు సాగు చేశారు. సన్న రకం ధాన్యం సాగులో రిస్కును గ్రహించి చాలా మంది రైతులు దొడ్డు రకాలపైనే దృష్టిసారించారు. నీటి వనరుల లభ్యత, పెట్టుబడి వ్యయాలకు భయపడి వెనుకడుగు వేశారు. దొడ్డు రకం ధాన్యానికి సైతం బోనస్ అమలు చేసి రైతులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని రైతులంతా కోరుతున్నారు.

**రైతుల పరిస్థితి అగమ్యగోచరం**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వారి సమస్యలను ఆలకించే నాథుడు కూడా లేకుండా పోయాడు. ఓ వైపు భూగర్భ జలాలు పడిపోవడం, సాగునీటికి కటకట ఏర్పడింది. దీంతో చేతికి వచ్చిన పంటను అమ్ముకునేందుకు ప్రభుత్వం నుంచి కేంద్రాల ఏర్పాటులో స్పష్టత లేకపోవడంతో రైతులు ఆగమాగమవుతున్నారు. ప్రైవేటు వ్యాపారులకు ధాన్యాన్ని అమ్ముకుంటే నష్టాలు సంభవిస్తాయని బాధపడుతున్నారు. గత సీజన్ లోనూ కేంద్రాల ఏర్పాటులో తాత్సారం చేయడంతో చాలా మంది ప్రైవేటు వర్తకులను ఆశ్రయించారు. ఈసారి అలా కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు. కేసీఆర్ హయాంలో అమలైన పద్ధతిలోనే ధాన్యం రాకను దృష్టిలో పెట్టుకుని సేకరణ చేపట్టాలని సూచిస్తున్నారు.





ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బిగాల గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు ఆయేషా ఫాతిమా, పార్టీ నాయకులు

# రంజాన్ తోఫాలు ఎందుకివ్వడంలేదు?



- మైనార్టీ సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ సర్కారు
- ముఖ్యమంత్రికి కేసీఆర్ అంటే భయం పట్టుకున్నది
- నిద్రలో కూడా ఆయన పేరే కలవరిస్తున్నడు..
- తెలంగాణ హిస్టరీ.. ఫ్యూచర్ కేసీఆరే..
- సీఎం అబద్ధాలు చెబితే సహించేదిలేదు..
- రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత ఫైర్



ఎమ్మెల్సీ కవితకు పండు తినిపిస్తున్న ఆయేషా ఫాతిమా



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

ఖలీల్‌వాడి, మార్చి 16: రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు కాంగ్రెస్ ప్రభుత్వం తోఫాలు ఎందుకు ఇవ్వడం లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. రంజాన్ సమయంలో మసీదుల సుందరీకరణ కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్కో మసీదుకు రూ.లక్ష ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క మసీదుకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ముస్లింల వైపున ఏ పార్టీ నిలుస్తున్నదో దీన్ని బట్టి తేటతెల్లమవుతున్నదని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ముస్లింలకు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉదయం నుంచి రాత్రి వరకు కేసీఆర్ జపం చేస్తున్నారని అన్నారు. తానే తెలంగాణ ఫ్యూచర్ అని చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ హిస్టరీ, తెలంగాణ ఫ్యూచర్ రెండు కూడా బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆరే అని స్పష్టంచేశారు. దీనిని రాసిపెట్టుకోవాలని సూచించారు. కేసీఆర్‌తో రేవంత్‌రెడ్డి ఏ రకంగానూ సరితూగరన్నారు. తమకు తెలంగాణ అంటే టాస్క్ అని, ఇతరులకు తెలంగాణ అంటే రాజకీయమని తెలిపారు. కేసీఆర్ అంటే సీఎం రేవంత్‌రెడ్డి భయపడుతున్నారని, నిద్రలో కూడా కేసీఆర్ పేరే కలవరిస్తున్నారని అన్నారు.

**గౌరవ మర్యాదలు కొనుక్కుంటే వచ్చేవి కాదు..**

'రైతుబంధు ఇవ్వను కానీ రఫ్‌గా మాట్లాడుతా, రుణమాఫీ చేయను కానీ బాగా రుబాబుగా మాట్లాడుతా, సాగునీరు ఇవ్వను కానీ సోది ముచ్చట్లు అన్ని చెబుతా, ఉద్యోగాలు ఇవ్వను కానీ వట్టి మాటలు చెబుతా, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇవ్వను కానీ తుఫెల్ మాటలు చెబుతాను అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంటున్నారని మండిపడ్డారు. గౌరవ మర్యాదలు అనేవి కొనుక్కుంటే వచ్చేవి కావని, మన నడవడిక, మాటతీరు, పని తీరు, పేరు బట్టి ఉంటాయన్నారు. సబ్బండ వర్ణాలను పట్టించుకోకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండి పడ్డారు. అబద్ధాలు చెబితే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. కేసీఆర్ మాట్లాడితే ఏం మాట్లాడుతున్నారోనని ప్రజలు టీవీలను ఆన్ చేస్తారని, కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడితే టీవీనీ మ్యూట్ చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడితే ముందుగానే సెన్సార్ బోర్డు వద్దకు వెళ్లి ఏ సర్టిఫికెట్ తీసుకొని వినాల్సిన దౌర్భాగ్యం ఏర్పడిందని ఎద్దేవా చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో అబద్ధాలు చెప్పి తిట్లు తిని పాపాన్ని మూట కట్టుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, బిగాల గణేశ్‌గుప్తా, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, మాజీ మేయర్ నీతూకిరణ్, మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా, రెడ్కో మాజీ చైర్మన్ అలీం, టీఎస్ పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, పార్టీ మైనార్టీ నాయకులు నవీద్ ఇక్బాల్, ఇమ్రాన్, మతీన్, జాగృతి నాయకులు అవంతి రావు, రెహాన్, మైనార్టీ నాయకులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



**హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో** తెలంగాణ భాషలో కవితలు, కథల పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్సీ కవిత హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ భాష మనకు గర్వకారణమని, మన భాషను ముందు తరాలకు అందించడం మన ధ్యేయం కావాలని పేర్కొన్నారు. కథలు, కవితలను మే 30లోపు haridaasaraswathiraj@gmail.com అనే మెయిల్‌కు పంపించాలని హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ సూచించారు. కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు నవీన్ ఆచారి, హరిదా రచయితల సంఘం ప్రతినిధి నరాల సుధాకర్, రామ్ స్మృతిక పాల్గొన్నారు.
– ఖలీల్‌వాడి, మార్చి 16

## మూడువేల ఈతచెట్లు దగ్ధం

బీబీపేట్(దోమకొండ), మార్చి 16: దోమకొండ మండల కేంద్ర శివారులోని దోమకొండ కౌండిన్య గౌడ సంఘానికి చెందిన దాదాపు మూడు వేల ఈత చెట్లు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. ఈ మేరకు గౌడ సంఘం ప్రతినిధులు ఆదివారం స్థానిక ఎస్సై స్రవంతికి ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈత వనంలో ఒకేసారి మూడువేల చెట్లు కాలిపోవడంతో గౌడ సంఘం ప్రతినిధులు, సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



దగ్ధమైన ఈతచెట్లను పరిశీలిస్తున్న గౌడ సంఘం ప్రతినిధులు,



గాయపడిన ఆధార్ కేంద్రం నిర్వాహకుడు

## కూలిన పాఠశాల పైకప్పు

**ఒకరికి తీవ్ర గాయాలు**


మెండోరా, మార్చి 16 : మండలంలోని దూదిగాం ప్రాథమిక పాఠశాల పైకప్పు ఆదివారం కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పాఠశాలలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆధార్ కేంద్రం నిర్వాహకుడు లక్ష్మణ్ పనిచేస్తుండగా ఒక్కసారిగా తరగతి పైకప్పు కూలింది. దీంతో లక్ష్మణ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆ సమయంలో పిల్లలు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించడంవల్లే పైకప్పు కూలిందని గ్రామస్తులు పేర్కొన్నారు.

## కొడుకు చేతిలో తండ్రి హతం

**ధర్పల్లి మండలంలో ఘటన**

ధర్పల్లి, మార్చి 16 : డబ్బుల విషయంలో జరిగిన గొడవలో తండ్రిని ఓ కొడుకు హతమార్చాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం హొన్నాజీపేట్ గ్రామంలో చోటు చేసుకున్నది. ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. హొన్నాజీపేట్‌కు చెందిన పాలెం నడ్పి మల్లయ్య (65), అతడి కుమారుడు మధు శనివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో గ్రామంలోని ఓ దుకాణం వద్ద డబ్బుల కోసం గొడవపడ్డారు. స్థానికులు అక్కడికి చేరుకొని సముదాయించారు. అనంతరం మధు ఇంటికెళ్లి గొడవ జరిగిన విషయం తన తల్లికి చెప్పాడు. సుమారు 10 గంటల సమయంలో ఇంటికి వచ్చిన మల్లయ్యను కుమారుడు మధు, భార్య లక్ష్మి కలిసి ఆయన గొంతు పట్టుకుని బలంగా నెట్టేయడంతో తల నేలకు తగిలి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. లేవబోతుంటే తలపై కొడుకు బీరు సీసాతో బలంగా బాదడంతో మల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితులను ఆదివారం అదుపులోకి తీసుకొన్నారు.

## విద్యుత్ ఉత్పత్తిలో లక్ష్యాన్ని చేరుకున్న ఎస్సారెస్పీ జెన్‌కో



- వరుసగా ఐదోసారి ..
- ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం

మోర్తాడ్, మార్చి16: విద్యుత్ ఉత్పత్తిలో ఎస్సారెస్పీ జలవిద్యుత్ కేంద్రం మరోమారు లక్ష్యాన్ని చేరుకున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి పంటలకు నీటివిడుదల కొనసాగుతుండడంతో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం చేరుకునే అవకాశం కలిగింది. 2024–25 సంవత్సరానికి 62 మిలియన్ యూనిట్ల లక్ష్యాన్ని జెన్‌కో అధికారులు నిర్ణయించారు. కాగా ఇప్పటికే లక్ష్యాన్ని పూర్తిచేసుకున్నది. వరుసగా ఐదు సంవత్సరాలపాటు నిర్ణయించిన లక్ష్యాన్ని చేరుకుంటున్నది. ఎస్సారెస్పీ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 2020–21 సంవత్సరంలో 90.7656 మిలియన్ యూనిట్లు, 2021–22లో 109.8417, 2022–23లో 138.9208, 2023–24లో 75.8692 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యింది. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం లో నాలుగు టర్బయిన్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నది. ఒక్కో టర్బయిన్ ద్వారా తొమ్మిది మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. ప్రాజెక్ట్ నిర్మించిన అనంతరం విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉండడంతో జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 1991 సంవత్సరంలో రికార్డు స్థాయిలో 146.43 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగింది. విద్యుత్ ఉత్పత్తి విషయంలో లక్ష్యాన్ని చేరుకోవడంతో పా టు ఇంకా యాసంగి పంటలకు నీటివిడుదల కొనసాగే అవకాశం ఉండడంతో విద్యు త్ ఉత్పత్తికూడా పెరిగే అవకాశం ఉన్నది. ఈ సంవత్సరం కూడా విద్యుత్ ఉత్పత్తిలో లక్ష్యాన్ని చేరుకోవడంతో జెన్‌కో అధికారులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు.